

# అనగనగా ఓ నాన్న

## మల్లాది వెంకట కృష్ణమూర్తి

*(గత సంచిక తరువాయి)*

**రెండు రోజులైనా** ఏలూరులోని శ్యామలరావు బావగారి తమ్ముడు సదాశివ నించి ఫోన్ రాకపోవడంతో త్రివిక్రం అతని సెల్‌ఫోన్‌కి ఫోన్ చేసాడు.

"మౌనంగానే ఎదగమని మొక్క నీకు చెబుతోంది" పాట వినిపించింది. ఆశావాదాన్ని రేకెత్తించే అది త్రివిక్రంకి నచ్చిన పాట. అవతలనించి వినిపించింది.

"హలో! ఎవరు?"

"నమస్తే. మీరు శ్యామలరావు గారి బావగారి తమ్ముడు సదాశివ కదూ?" అడిగాడు.

"అవునండి. మీరు?"

"డాక్టర్ త్రివిక్రంని. మీ కాలింగ్.."

"ఆఁ గుర్తొచ్చింది. విశ్వేశ్వరరావు ఆ ఇల్లు ఖాళీ చేసేసాడు. ఎక్కడున్నాడో తెలీదు."

"ఇంటి వాళ్ళకి ఆయన కొత్త అడ్రస్ ఇవ్వలేదా?"

"లేదు. ఆ ఇంటాయన పోయాడు. ఆయన పిల్లలకి వివరాలు తెలీవట."

"అరెరే! తెలిస్తే నాకు దయచేసి చెప్తారు కదా?"

"తప్పకుండా."

"థాంక్సండి" త్రివిక్రం లైన్ కట్ చేసాడు. ఎలా తెలుసుకోవడం?

తనే ఓసారి ఏలూరుకి వెళ్ళి రావాలని నిశ్చయించుకున్నాడు. తనకి బుధవారం ఆఫ్ కాబట్టి మంగళవారం రాత్రి వెళ్ళి గురువారం ఉదయానికల్లా తిరిగి రావాలని అనుకున్నాడు. ఆ ప్రకారం ఇంటర్నెట్‌లోని ఇండియన్ రైల్వేస్ వెబ్ సైట్‌లోకి వెళ్ళి, రిజర్వేషన్స్ కూడా వెంటనే చేసుకున్నాడు. శ్యామలరావుని వెళ్ళి రమ్మంటే వెళ్ళొస్తాడు. కానీ అతన్ని శ్రమ పెట్టడం త్రివిక్రంకి ఇష్టంలేదు. రైల్వే వారి జాబితాలో ఉన్న హోటల్స్ లిస్ట్‌లోని ఓ హోటల్‌లో గదిని కూడా ఇంటర్‌నెట్ ద్వారానే రిజర్వ్ చేసుకున్నాడు. ఆ జాబితాలోని హోటల్స్ అంత స్టాండర్డ్‌గా ఉండవన్న అనుభవం ఉన్నా ఒక్క రాత్రికేగా అనుకున్నాడు.

తర్వాత ఇంటర్నెట్‌లో చాటింగ్‌క్ వెళ్ళాడు. బింబ్లీ ఆన్ లైన్‌లో ఉంది.

"హాయ్!" ఆమెని పలకరించాడు.

"హాయ్! లాంగ్ టైం. నో సీ?"

"యస్. బిజీ."

"ఆర్ యూ బేక్ టు యువర్ రొటీన్?" టైప్ అయిన అక్షరాలు కనిపించాయి.

"యస్."

"మా ఇంట్లో ఓ చారిత్రాత్మక మంచం ఉంది తెలుసా?" అన్న పదాలు ఇంగ్లీష్‌లో కనిపించాయి.

"చారిత్రాత్మక మంచం అంటే? శివాజీ మహరాజు దాన్ని మీ ముత్తాతకి కానుకగా ఇచ్చాడా? లేక నెహ్రూగారి మొదటి రాత్రి దానిమీద గడిచిందా?"

"వివరిస్తాను ఆలకించండి. టైపింగ్ బోర్‌గా ఉంది. పోనీ వాయిస్ మెయిల్ పంపనా?"

"సారీ?"

"నా దగ్గర సోనీ వాయిస్ రికార్డర్ ఉంది. అందులో రికార్డ్ చేసి దాన్ని నా లాప్‌టాప్‌లోకి ఎక్కించి మీకు ఈ మెయిల్ అటాచ్‌మెంట్‌గా ఆ ఫైల్‌ని పంపుతాను."

"వండ్రఫుల్"

అందువల్ల బింబ్లీ అమ్మాయో కాదో తెలుస్తుంది అని అనిపించింది.

"మీ ఈ మెయిల్ ఐడి?"

దాన్ని ఇచ్చాడు.

"ఐతే ఓ షరతు."

"ఏమిటది?" టైప్ చేసాడు.

"మీరు విన్నది వినగానే మీకు కలిగిన స్పందనని నాకు టైప్ చేసి వెంట వెంటనే ఈ-మెయిల్స్ పంపుతూండాలి."

"ఓ.కె"

"సరిగ్గా నలభై ఏడు నిముషాల తర్వాత మీ ఇన్‌బాక్స్‌లో అదుంటుంది. సైన్ ఆఫ్ చేస్తున్నాను. మీరు ఆలస్యంగా చాటింగ్‌లోకి వచ్చారు. గంటనించి చాటింగ్‌లో ఉన్నాను. బై"

బింబ్లీ సైన్ అవుటైన మెసేజ్ బాక్స్ మానిటర్ మీద కనిపించింది.

త్రివిక్రంకి కొద్దిగా ఎక్సయిటింగ్‌గా ఉంది. బింబ్లీ మగాడై ఉండడు. అయితే కంఠధ్వని పంపలేడు. నిజంగా అమ్మాయే అయి ఉండాలి. అదే నిజమైతే కొంతదాకా నిజాయితీ గల మనిషే. కంఠధ్వనిని బట్టి తను ఆమె వయస్సు తెలుసుకోగలడా? ఇంగ్లీష్ ఉచ్చారణని బట్టి చదువుకున్నదో కాదో కొంతదాకా అంచనా వేయచ్చు. రకరకాల ఆలోచనలతో త్రివిక్రం ఇంటర్నెట్‌లోని మెడికల్ వెబ్ సైట్స్ బ్రౌజ్ చేస్తూ, తనకి పనికి వచ్చేవి ప్రింటవుట్ తీసుకోడానికి వివిధ సబ్జెక్టుల కింద నోట్ పేడ్‌లో పేస్ట్ చేస్తూ గడిపాడు. సరిగ్గా ముప్పావు గంట తర్వాత తన ఇన్‌బాక్స్‌లోకి వెళ్ళాడు. 'స్ఫూర్తి' పేర ఓ మెయిల్ ఉంది. ఆ అమ్మాయి పేరు స్ఫూర్తా? చాలామంచి పేరు. రిప్లై బటన్ నొక్కి ముందు అదే టైప్ చేసి పంపాడు. టెక్స్ట్‌లో ఏం లేదు. అటాచ్‌మెంట్‌లో వైరస్ ఉండి ఉంటుందా? మగవాడా? ఇలా టెంప్ట్ చేసి వైరస్‌ని పంపాడా?

ఛీ! నార్టన్ యాంటీ వైరస్ తన సిస్టమ్‌లో ఉందిగా. నెగిటివ్ థాట్స్ దేనికి? సందేహాలన్నింటిని పక్కన పెట్టి అటాచ్‌మెంట్‌ని త్రివిక్రం క్లిక్ చేసాడు. వైరస్ లేదు. అతనికి ఓ కంఠ ధ్వని వినిపించసాగింది.

'హాయ్! ది సీజ్ బింబ్లీ అలియాస్ స్ఫూర్తి. హౌ ఆర్ యూ డూయింగ్ టు డే? ఆశ్చర్యంగా ఉందా?'

ఆడకంఠం. ఆ తర్వాత తెలుగులో సాగిందా వాయిస్ మెయిల్. ఆమె నటి ఏమో అని కూడా అనుమానం కలిగింది. చెప్పేది ఫ్లాట్‌గా కాకుండా ఆమె ఉచ్చారణలో భావాలు కూడా తొంగి చూస్తున్నాయి. త్రివిక్రం జాగ్రత్తగా వినసాగాడు.

'మీ వాయిస్ బావుంది.' ఆమెకి ఈ మెయిల్ పంపాడు.

'నెహ్రూకి, మా చారిత్రాత్మక మంచానికి ఎలాంటి సంబంధంలేదు. అలాగే శివాజీకి కూడా. మా ఇంట్లోని ఆ మంచం మా తాతగారికి వారి తాతగారి నించి వచ్చింది. అయితే ఆ షేప్‌లో కాదు. అది మరీ ఎత్తుగా, మరీ పెద్దగా ఏడున్నర అడుగుల పొడవు, అరడుగుల వెడల్పు ఉండేదిట. దానిమీంచి పడ్డ మా తాతయ్యకి చిన్నప్పుడు పన్ను కూడా విరిగింది. దాంతో మా తాతయ్యకి మా నాన్న పుట్టాక దాన్ని విడగొట్టించి ఆ చెక్కతో ఓ పెద్ద మంచం, ఓ చిన్న మంచంగా చేయించారు. అంతేకానీ ఆయనకి ఇద్దరు భార్యలు లేరు''

'ఇంట్రెస్టింగ్ హిస్టరీ' ఇంకో ఈమెయిల్ పంపాడు.

'దాని తలవైపు చెక్కని - హెడ్ బోర్డ్ అంటాం ఇంగ్లీష్‌లో ముఖ్యమైన తారీకులు మా అమ్మ రాసేది. నేను నా చిన్నప్పటినించి వాటిని చూస్తున్నాను. మా అక్కయ్య చెప్పింది మా అమ్మ ఆ తారీకులు ఎందుకు రాసిందో.

'అవి మన ఫేమిలీ హిస్టరీకి సంబంధించినవి. నీలం రంగులో రాసినవి సామాన్య విశేషాలకి చెందినవి. నల్ల రంగువి విచారకరదినాలని సూచిస్తాయి. ఎర్ర రంగువి పెద్ద విషాదాలని సూచించేవి' అని అక్క చెప్పింది. ప్రతీ తేదీ గురించి వివరించమన్నాను. మొదటిది మా అమ్మానాన్నల పెళ్ళి జరిగిన తారీకు. రెండోది మా అమ్మని మా నాన్న పెళ్ళయ్యాక మొదటిసారిగా కసురుకున్న తారీకు. ఆ రోజు మజ్జిగ పులుసులో అమ్మ ఉప్పు వేయడం మర్చిపోయిందిట. 'ఇదేమిటి? నల్లరంగు వాడకుండా నీలం రంగులో రాసిందా తారీకు?' అడిగాను. ఆ రోజు నాన్నకి, అమ్మకీ కొత్తదనం పోయి బంధం గట్టిదైందని తెలిసిన రోజు. కొత్త వధువుని ఎవరూ తిట్టరు. ఏమైనా అనుకోవచ్చనే భయంవల్ల ఆమె చేసినవన్నీ మౌనంగా భరిస్తారు. ఆ భయం ఆ వ్యక్తుల మధ్య కొంత ఎడాన్ని ఉంచుతుంది. 'ఈ వ్యక్తి నా వ్యక్తే' అనే నమ్మకం కలిగాక ఆ భయం పోయి ఏదైనా అణుచుకోకుండా మాట్లాడగలరు. ఈ స్థితికి వచ్చిన రోజు కాబట్టి ఆ రోజు అమ్మానాన్నల బంధపు పునాదులు గట్టిపడ్డాయన్న సంతోషం అమ్మకి కలిగి, నల్ల రంగులో రాయలేదు' మా అక్క వివరించింది.

'యువర్ మదర్ ఈజ్ ఏ వెరీ గుడ్ సైకలాజికల్ ఎనలజిస్ట్' టైప్ చేసి పంపాడు.

'కొన్ని మా అమ్మ రాసింది. మా అమ్మ పోయాక మా నాన్నగారు, లేదా మా అక్కయ్య అక్కడ తేదీలని రాయడం కొనసాగించారు. మొదటి ఎర్రరంగు తారీకున మా అమ్మకి మిస్ కేరేజ్ అయింది. కొడుకు పుడతాడని, వాడికి రామలింగం అనే పేరు పెట్టుకోవాలని అనుకుంది. ఆ పేరుకి కారణం కూడా ఉంది. అమ్మ చదివే అప్పర్ ప్రైమరి స్కూల్లోని లెక్కల మాష్టారు తరుచూ కొట్టేవాడట. మీరు కరెక్ట్‌గా ఊహించారు. ఆయన పేరు రామలింగం. కొడుకుని కొట్టినప్పుడల్లా ఆయన మీద కోపం కొంత తగ్గుతుందని ఆ పేరు పెట్టుకోవాలని అనుకుందిట. 'ఇది నిజమా, అబద్ధమా?' అని అడిగితే, అక్కయ్యతో 'నువ్వెలా కావాలనుకుంటే అలా అనుకో' అన్నదిట. లక్కీ ఫెలో. రామలింగం పుట్టకుండా అమ్మ మొట్టికాయల నించి తప్పించుకున్నాడు.'

'మీది సెన్సాఫ్ హ్యూమర్ గల కుటుంబం.' టైప్ చేసి పంపాడు.

'మీరు మీ రియాక్షన్స్‌ని నాకు ఈ మెయిల్ ద్వారా ఇవి వింటూ పంపమన్నాను. పంపుతున్నారా? ఎర్ర రంగు బాల్‌పెన్‌తో రాసిన మరో తారీకు గురించి. ఆ రోజు మా అమ్మ పుట్టింట్లో ఉండగా వెనకాల దొడ్లోకి ఓ పాము వచ్చింది. మా పిన్ని దాన్ని చూసి అందర్నీ పిలిస్తే, ఆ పాముని కొట్టి చంపేసారు. ఎవర్నీ ఏం చేయని, ఓ చెట్టుకింద పడుకున్న దాన్ని చంపొద్దని మా అమ్మ చెప్పినా వినకుండా చంపటంతో మా అమ్మకి బాధేసిందిట.'

'కైండ్ హార్టెడ్ మమ్' టైప్ చేసి పంపాడు త్రివిక్రం.

'మా అమ్మ నల్లరంగుతో రాసిన ఓ తారీకున. ఆమె చిన్న మరిది కొడుకు ఉయ్యాలలోంచి పడి కుడి పాదం ఫ్రాక్చరైంది. అయితే అది తేలిగ్గానే అతుక్కుందిట. మా అమ్మ రాసిన ఆఖరి తేదీ అదే. ఆ తర్వాతి తేదీ లెట్ మీ చెక్. అవును. ఆకుపచ్చ రంగుతో ఆ తేదీ ఉంది. మా పదమూడో ఏట మా అక్క, నేను అదేమిటో ప్రత్యేకంగా చెప్పను. మీరే గెస్ చేయండి.'

'నా గెస్ నిజమైతే అదే అయి ఉంటుంది.' టైప్ చేసి పంపాడు.

ఆ అమ్మాయి కంఠం కొనసాగింది.

'మరో తారీకు ఎర్ర రంగులో ఉంది. మా తాతయ్యకి, అంటే మా అమ్మ మామగారికి పేంకియాట్రిక్ కేన్సర్ అని తెలిసిన రోజది మూడు నెలల తర్వాతి ఎర్ర తేదీ మా తాతయ్య పోయిన రోజు. ఇంకా ఇలా చాలా తేదీలు ఉన్నాయి. మేము ఇంటర్ పాసయినట్లుగా ఫలితాలు తెలిసిన తారీకులు, పెళ్ళిళ్ళు జరిగిన రోజులు, మొదటి మనవడు, మొదటి మనవరాలు పుట్టిన తారీఖులు, మా ఇంటికి యూనిఫాంలో ఉన్న పోలీసు వచ్చి డోర్ బెల్ కొట్టిన తారీఖు. మా అక్క అతన్ని చూసి వణికిపోయిందిట. ఇంతకీ అతనొచ్చింది ఎందుకో తెలుసా? భిక్షానికి. పోలీసు వేషంలో దసరా పండుగ రోజు పగటి వేషగాడు వచ్చాడు.'

'పోలీస్ థింగ్ చాలా ఫన్నీగా ఉంది. ఈరోజుల్లో కూడా అలాంటి పగటి వేషగాళ్ళు ఉన్నారా?' టైప్ చేసి ఈ మెయిల్ పంపాడు.

'రియల్ హిస్టారిక్ డేట్స్ కూడా ఉన్నాయండోయ్. తేదీల ప్రాముఖ్యత మీకు తెలుసా? రాజీవ్ గాంధీ, ఇందిరా గాంధీలు హత్య చేయబడ్డ తారీకులు. అక్టోబర్ ముప్పై ఒకటి ఎయిటీ ఫోర్‌న ఇందిరాగాంధీ హత్య చేయబడ్డ రోజు. మా నాన్న నల్గొండ నించి సూర్యాపేట వెళ్ళే బస్‌లో ఉండి, దాన్ని మధ్యలో ఆపేసాక, నానా అవస్థపడ్డారు. మన స్వతంత్ర భారతదేశంలో ఇరవై నాలుగు గంటలపాటు మా డాడీకి తిండి, స్నానం లేదు.'

'మన భారతదేశంలో స్వతంత్రం ఇప్పుడింకా ఎక్కువైంది. ఆర్టీసీ బస్‌లే కాదు. తమకి కోపం తెప్పించిన ఏ వ్యక్తి ఆస్తులైనా ధ్వంసం చేయచ్చు. మన వెనక కులం యూనియనో, పొలిటికల్ పార్టీనో ఉంటే చాలు. వారికి ఏం కాదు' టైప్ చేసి పంపాడు.

"ఓ ఎర్ర రంగులో ఉన్న ఓ తారీఖు వెనక విషాదం ఏమిటంటే, మా పరుపు చిరిగిపోయింది. అది నాశనం మా అమ్మకి చాలా దుఃఖాన్ని కలిగించింది. మేమంతా దానిమీద పెరిగిన వారమేట. అందులో దూదిని ఏకించి మళ్ళీ చిన్న చిన్న పరుపులుగా కుట్టించి, వారసత్వంగా మా పిల్లలకి వాడమని మా అందరికీ మా నాన్న తలోటి ఇచ్చారు. అఫ్‌కోర్స్. నేనింకా దాన్ని వాడే అవకాశం రాలేదు.'

'ఛార్మిగ్ సెంటిమెంట్' ఈ మెయిల్ పంపాడు.

'ఇంకా ఇలాంటి అనేక తారీఖులు అనేక కథనాలు, ముప్పై రెండేళ్ళ సంసార జీవితంలో ఎన్నెన్నో సొగసులు, ఎన్నెన్నో విశేషాలు, ఎన్నెన్నో తమాషాలు ఉంటాయి కదా. అన్నట్లు ఆ మంచం మీది హెడ్ బోర్డ్ మీది మా నాన్నగారి ఎర్ర రంగులో రాసిన ఓ తారీకునే మా అమ్మ పోయింది.'

అంతటితో ఆ వాయిస్ మెయిల్ ఆగిపోయింది.

'సో సారీ విషాదంతో ముగించారు.' టైప్ చేసి పంపాడు. స్ఫూర్తినించి ఏమైనా జవాబులు వచ్చాయేమోనని తన ఇన్‌బాక్స్‌లోకి వెళ్ళి చూసాడు. లేవు. రిఫ్రెష్ బటన్ నొక్కాడు. అన్నిటికన్నా పైన స్ఫూర్తి నుంచి ఓ మెయిల్ వచ్చింది. దాన్ని ఆత్రంగా క్లిక్ చేసాడు.

'ఏ బిగ్ థాంక్స్ ఫర్ ఆల్ యువర్ కామెంట్స్. మా అమ్మ మరణం నాకు పెద్ద విషాదం' అని ఉంది.

సుందరేశ్వర్ సమర్థత మీద నమ్మకం, నిజాయితీ మీద విశ్వాసం ఏర్పడటం వల్లనే త్రివిక్రం ఏలూరుకి ప్రయాణం పెట్టుకున్నాడు. ఏలూరుకి రైల్లో వెళ్ళడం బెటర్ అని, ఆర్.టి.సి బస్‌స్టాండ్ ఊరు బయట ఉంటుందని, ఎప్పుడో ఎవరో చెప్పింది గుర్తుంది. సుందరేశ్వర్‌కి, తండ్రికి చెప్పి ఏలూరుకి బయలుదేరాడు. తండ్రికి చెప్పినా గుర్తుండకపోవచ్చని తెలిసినా చెప్పాడు.

శ్యామలరావుకి ఫోన్ చేసి తను ఏలూరు వెళ్తున్నట్లుగా చెప్పి, అతని బావగారి తమ్ముడ్ని తను మర్నాడు ఉదయం కలుస్తానని, విశ్వేశ్వరరావు ఎక్కడున్నాడో తెలుసుకునేందుకు సహాయం చేయమని చెప్పమని కోరాడు. అతను సరేనని, అయిదునిముషాల తర్వాత ఫోన్ చేసి తన బావ తమ్ముడు సదాశివకి చెప్పానని, ఆయన హెల్ప్ చేస్తానని మాట ఇచ్చాడని చెప్పాడు.

మర్నాడు ఉదయం ఏలూరు రైల్వే స్టేషన్‌లో రైలు దిగి సరాసరి హోటల్‌కి వెళ్ళాడు. త్రివిక్రం భయపడినంత దరిద్రంగా లేదా హోటల్. కానీ దాని స్టాండర్డ్‌కి చెల్లించే అద్దె మాత్రం ఎక్కువే అనిపించింది అతనికి.

స్నానం, బ్రేక్‌ఫాస్ట్‌లు చేసి సదాశివకి ఫోన్ చేసాడు. అతనింటికి ఎలా వెళ్ళాలో కనుక్కుని అరగంటలో అక్కడికి చేరుకుంటానని చెప్పాడు.

టాక్సీ కావాలని హోటల్ రిసెప్షనిస్ట్‌తో చెప్పాడు. అతను వెంటనే అడిగాడు.

"పెళ్ళి చూపుల్లాంటి ముఖ్యమైన పనా? ఎంతమందికి టాక్సీ కావాలి? ఎక్కడికి వెళ్ళాలి?"

"నా ఒక్కడికే. ఊళ్ళో అనేక చోట్లకి వెళ్ళాలి."

"టాక్సీకి మీకు డ్రైవర్ బేటాతో కలిపి అయిదారు వందలకి తక్కువ కాదు. మీరొక్కరే అన్నారు కాబట్టి ఎనిమిది గంటలకి ఆటోని మాట్లాడుకోండి. పెట్రోల్ మీరు పోయించేట్లు, ఎంత దూరమైనా తిరిగేట్లు. ఆటోకి రెండు వందలో, రెండు వందల యాభయ్యో ఇస్తే చాలు. ఇది నా సలహా మాత్రమే. టాక్సీ కావాలంటే మాట్లాడతాను."

"ఐతే ఆటో చాలు. మీకు తెలిసిన డ్రైవర్లున్నారా?"

"ఉన్నారు. మాట్లాడమంటే మాట్లాడతాను."

"థేంక్స్ మాట్లాడండి."

ఆ ప్రకారం ఆ రాత్రి త్రివిక్రంని రైల్వే స్టేషన్‌లో డ్రాప్ చేసే దాకా ఓ ఆటోని రిసెప్షనిస్ట్ మాట్లాడాడు. రెండు వందల ఏభైరూపాయలు ఇచ్చి పెట్రోలు త్రివిక్రమే పోయించేట్లు, ఎంత దూరమైనా తిప్పేట్లు ఏర్పాటు.

సదాశివ ఇల్లు రైలు పట్టాల పక్కన ఉన్న ఓ చిన్న కాలనీలో ఉంది. అక్కడ నివశించే వారంతా మధ్య తరగతి వాళ్ళే అని ఇళ్ళని బట్టి త్రివిక్రం గ్రహించాడు.

ప్రహరీ గోడకి ఉన్న తలుపు తెరుచుకుని లోపలికి వెళ్తే చిన్న పెంకుటిల్లు. పంచలో పై నించి చేరతో కట్టిన ఖాళీ ఉయ్యాల, పేముతో చేసిన రెండు స్టూల్స్ కనిపించాయి. నల్లటి నాపరాయి పరిచి ఉన్న నేలమీదంతా తెల్లటి నాముతో పెట్టిన ముగ్గులు. ఓ అరుగుకి ఆనించి ఓ సైకిల్ నిలబెట్టి ఉంది. ఇంటి గుమ్మం దగ్గర ఆగి పిలిచాడు.

"సదాశివగారూ?"

"రండి" ఓ కంఠం వినపడింది.

బూట్లు వదిలి సాక్స్‌తో లోపలికి వెళ్ళాడు. తెల్లటి లుంగీ, కట్ బనీన్‌లో, బక్కపలచగా ఉన్న నలభై ఏళ్ళతను కనిపించాడు. అతని జుట్టు సగం పైనే నెరిసి, క్రాఫ్ ముందు నుదుటి మీద పడుతోంది.

"నేను త్రివిక్రంని. హైదరాబాద్ నించి వచ్చాను. మీరు సదాశివగారేనా?"

"అవును. రండి. కూర్చోండి."

"మీ సహాయం కావాలి. విశ్వేశ్వరావు ఏలూరులోనే ఉంటే, అతన్ని సాయంత్రంలోగా కలుసుకోవాలి. రాత్రి మళ్ళీ రైల్లో హైదరాబాద్ వెళ్ళిపోతున్నాను."

"అలాగే. ముందు విశ్వేశ్వరరావు పాత ఇంటికి తీసుకెళ్తాను."

"థేంక్స్. అలా చేద్దాం."

ఓ ముప్పై అయిదేళ్ళావిడ చేతిలో ఇడ్లీ ప్లేట్లతో వచ్చింది.

"తీసుకోండి" చెప్పాడు సదాశివ.

"వద్దండి. నేను బ్రేక్‌ఫాస్ట్ తినే వస్తున్నాను. మాకు హైదరాబాద్‌లో మంచి పెసరట్టు దొరకదు. ఇడ్లీలతో పాటు అది తిన్నాను. ఫుల్‌గా ఉంది కడుపు."

"కంపెనీకి ఒక్కటైనా తినండి."

కాదనలేక తెచ్చిన నాలుగిటిలో మూడిటిని తీసెయ్యమని ఒకటి తిన్నాడు. రవ్వ ఎక్కువ, మినప్పిండి తక్కువ కాబట్టి చాలా గట్టిగా ఉందది. రుచి కూడా లేదు. తిన్నాక అతను బట్టలు వేసుకుని బయటికి వచ్చాడు. సైకిల్ తీయబోతుంటే చెప్పాడు త్రివిక్రం.

"ఆటో ఉంది."

"ఎందుకు దండగ? పంపించేయండి. దగ్గరే. సైకిల్ మీద వెళ్ళొచ్చు."

"నేనీ రోజుకంతా దాన్ని మాట్లాడుకున్నాను. ఆటోలో వెళ్దాం."

సదాశివ మాట్లాడకుండా ఆటో ఎక్కి, ఆటో డ్రైవర్‌కి అడ్రస్ చెప్పాడు. తర్వాత తన సెల్‌ఫోన్ తీసి, తన కొలీగ్‌కి తను ఆఫీస్‌కి లేట్‌గా వస్తున్నట్లుగా చెప్పాడు.

"విశ్వేశ్వరరావు మొదటి భార్య పేరు ప్రమీల. మీకు తెలుసనుకుంటాను. అతనికి ఇద్దరు పెళ్ళాలు."

"ఊ"

"మొదటి భార్య పోయాకే రెండో పెళ్ళి చేసుకున్నాడు. అతని రెండో భార్య పేరు సృజనో, సజనో ఏదో ఉండాలి. ఇదంతా జరిగి చాలాకాలమైంది. మనిషి మంచివాడు. ఫ్యాక్టరీ మెషీన్స్ బాగా పాతబడటంతో జూట్ మిల్ మూసేసి ఆ స్థలాన్ని అపార్ట్‌మెంట్స్ కట్టడానికి వాడారు. దాంతో చాలామంది ఉద్యోగాలు పోయాయి. ఇప్పుడక్కడ పెద్ద కాంప్లెక్స్‌ని కట్టారు. కొందరు హైదరాబాద్‌కి, ఇంకొందరు కాకినాడకి ఉద్యోగాలు సంపాదించుకుని వెళ్ళిపోయారు. నాది స్వంతిల్లు కాబట్టి నేను ఈ ఊరు విడిచి వెళ్ళలేదు. ఏదో చిన్న ఉద్యోగం చేస్తున్నాను మా ఆవిడ ఇంటిదగ్గరే ట్యూషన్లు చెప్తుంది."

ఆటో ఓ సందులోకి రాగానే సదాశివ ఓ ఇంటి గుర్తు చెప్పి దానిముందు ఆపించాడు.

"దిగండి. ఇందులోనే దక్షిణం వైపు వాటాలో అతను ఇదివరకు అద్దెకి ఉండేవాడు."

సదాశివ త్రివిక్రంని ఇంటి వాళ్ళకి పరిచయం చేసాడు.

"మీ ఇంట్లో మూడేళ్ళ క్రితం దాకా అద్దెకున్న విశ్వేశ్వరరావుతో ముఖ్యమైన పని పడింది. అతన్ని కలుసుకుందామని వచ్చాను. మీ ఇల్లు ఖాళీ చేసి ఎక్కడికి వెళ్ళాడో చెప్పగలరా?" అడిగాడు త్రివిక్రం.

"మాకు పెద్దగా తెలీదండి" ఇంటాయన కొడుకు చెప్పాడు.

"గుర్తు చేసుకోగలరా? లేదా మీ ఇంట్లో ఇంకెవరికైనా తెలుసేమో కనుక్కోగలరా? నేను ఈ పని మీదే హైదరాబాద్‌నించి వచ్చాను." ముందు గది అల్మారాలోని అందమైన పింక్ రంగు సరస్వతి బొమ్మని చూస్తూ అడిగాడు.

"కరెక్టే. కానీ మా ఇంట్లో వాళ్ళకి కూడా అతని గురించి ఏం తెలీదు."

"పోనీ విశ్వేశ్వరరావు ఇంటికి తరుచు వచ్చే ఫ్రెండ్స్ గురించి చెప్పగలరా? వాళ్ళని కలిస్తే వాళ్ళు చెప్పచ్చు."

"వాళ్ళెవరూ కూడా మాకు తెలీదండి. అతను మీకు ఎంత బాకీ?"

"బాకీ ఏం లేదు. కొంత సమాచారం కోసం మాత్రమే అతన్ని కలుసుకోవాలని అనుకుంటున్నాను."

అతనికి ప్రభుత్వ ఉద్యోగి లక్షణాలు చాలా ఉన్నాయని గ్రహించాడు త్రివిక్రం. ఏదైనా పనిమీద ప్రభుత్వ కార్యాలయానికి వెళ్తే 'లేదు' అని పని చేయకుండా ఎలా చెప్పి పంపించాలా అన్న దృక్పథంతో ప్రభుత్వ ఉద్యోగులు ప్రవర్తిస్తారు. ఇతని ప్రవర్తనా అలాగే అంటీ అంటనట్లుగా ఉంది. అతని మొహం సహజంగానే చికాకుగా ఉంటుందని అనుకున్నాడు.

"పోనీ అప్పుడు అద్దెకి ఉన్న వారు ఎవరైనా ఇంకా ఉన్నారా? వాళ్ళకి తెలియచ్చు."

"పడమర వాటాలోని వాళ్ళని అడిగి చూడండి. అతను అప్పటినించీ ఉంటున్నాడు. రైల్వే బుకింగ్ క్లర్క్."

"థాంక్స్. మీరెక్కడ పనిచేస్తున్నారు?" అడిగాడు త్రివిక్రం.

"మున్సిపాలిటీలో సెక్షన్ హెడ్ని."

ఇద్దరూ పడమర వాటాలోకి వెళ్ళారు. దానికి దారి అవతలి రోడ్డులోంచి ఉంది. అప్పుడే ఆఫీస్‌కి బయలుదేరబోతున్నాడతను.

సదాశివ అతనికి త్రివిక్రంని పరిచయం చేసి తాము వచ్చిన పని గురించి టూకీగా చెప్పాడు.

"విశ్వేశ్వరరావు హైదరాబాద్ వెళ్ళిపోయాడండి. జూట్ మిల్‌లో ఉద్యోగం పోయాక అక్కడ అతనికి అతని బాబాయ్ అల్లుడు ఏదో ఉద్యోగం ఇప్పించాడు.

"ఎక్కడ?"

"బాలానగర్‌లో అనుకుంటా. గుర్తులేదండి. ఏదో ఫ్యాక్టరీలో అసిస్టెంట్ గోడౌన్ కీపర్ ఉద్యోగం అని చెప్పినట్లు గుర్తు."

"కావచ్చు. ఇక్కడ కూడా గోడౌన్ సెక్షన్‌లోనే ఎక్కువ కాలం పనిచేసాడు" చెప్పాడు సదాశివ.

"బాలానగర్‌లో చాలా కంపెనీలు ఉంటాయి. ఏ కంపెనీనో చెప్పాడా? జూట్ మిల్లా? స్టీల్ మిల్లా?"

"గుర్తులేదండి. అదీకాక విశ్వేశ్వరరావు ఎవరితో కలవిడిగా ఉండేవాడు కాదు. మా మధ్య పెద్దగా పరిచయం లేదనే చెప్పాలి."

"అతని స్వగ్రామం ఏదో తెలుసా?"

"కాకినాడ దగ్గర బెండపూడి. మాది కాకినాడలెండి."

"ఆయనకి పిల్లలా?"

"ఇద్దరు. కొడుకు సుశీల్. కూతురు ప్రవీణ. మా ఆవిడ వాళ్ళని ఆట పట్టిస్తూండేది. మీ నాన్న కూతురికి మగపేరు, కొడుక్కి ఆడపేరు పెట్టారని. సుశీల, ప్రవీణ్ లన్నమాట." నవ్వాడు.

త్రివిక్రం కూడా నవ్వి అడిగాడు.

"అతని భార్య పేరు?"

"సృజన.

ముందు గదిలో గూట్లోని వినాయకుడి బొమ్మని చూసాడు త్రివిక్రం. ఇందాక ఇంటివాళ్ళింట్లో చూసిన సరస్వతి బొమ్మ చేసిన మెటీరియల్‌తోనే దాన్నీ చేసారని గ్రహించాడు.

తన విజిటింగ్ కార్డ్ ఇచ్చి చెప్పాడు.

"బై ఎనీ ఛాన్స్, మీకు విశ్వేశ్వరరావు అడ్రస్ తెలిస్తే దయచేసి నాకు ఫోన్ చేసి చెప్తారా?"

"అలాగే" దాన్ని చదివి భార్యని పిలిచి విషయం చెప్పి ఆ కార్డ్ ఇచ్చాడు.

అతనికి థాంక్స్ చెప్పి ఇద్దరూ బయటకి వచ్చాక అదిగాడు సదాశివ.

"నేనింక ఆఫీస్‌కి వెళ్ళొచ్చా?"

"మీతోపాటు జూట్‌మిల్‌లో పని చేసిన ఇంకెవరైనా కొలీగ్స్ ఇళ్ళు తెలిస్తే అక్కడికి తీసుకెళ్తారా? వాళ్ళకేమైనా తెలుసేమో కనుక్కుందాం."

"అలాగే. భావన్నారాయణ అని.. కొద్దిగా దూరం."

ఆటో డ్రైవర్‌కి అడ్రస్ చెప్పాడు. దాదాపు ముప్పావు గంట తర్వాత అక్కడికి చేరుకున్నారు. ఓ పెద్ద చెరువు పక్కన ఉందతని ఇల్లు. అదీ మధ్య తరగతి పెంకుటిల్లే. భావన్నారాయణ లేడు. అతని భార్య ఉంది. సదాశివని చూసి నవ్వుతూ లోపలికి ఆహ్వానించింది. అతను త్రివిక్రంని పరిచయం చేసి తాము వచ్చిన పని గురించి చెప్పాడు.

"విశ్వేశ్వరరావు వాళ్ళు హైదరాబాద్ వెళ్ళిపోయారండి" చెప్పిందామె.

"అక్కడ వాళ్ళ అడ్రస్ కానీ, ఫోన్ నెంబరుకానీ తెలుసా?"

"తెలీదు. స్రుజన వెళ్ళాక ఉత్తరం రాస్తానంది. రాయనేలేదు."

"అతని బంధువుల వివరాలు కానీ, స్రుజన బంధువుల వివరాలు కానీ తెలుసా?" అడిగాడుఉ.

"ఊహూ. విశ్వేశ్వరరావుకి ఓ తమ్ముడు ఉండేవాడు. వైజాగ్ నించి అనుకుంటా, నేను వెళ్ళినప్పుడు ఓసారి వాళ్ళింటికి వచ్చాడు. అతని గురించి ఏం తెలీదు."

"విశ్వేశ్వరరావు ఫోటో ఉందా?"

"మా ఇంట్లో ఉంది. మిల్‌లో పనిచేసిన వాళ్ళంతా ఆఖరిరోజు కలిసి ఫోటో తీయించుకున్నాం" చెప్పాడు సదాశివ.

"అది మా ఇంట్లో కూడా ఉంది" చెప్పిందావిడ.

"మీ ఇద్దరిలో నాకది ఎవరు ఇస్తారు? మళ్ళీ జాగ్రత్తగా కొరియర్‌లో పంపిస్తాను."

"నేనిస్తాను లెండి" వెంటనే చెప్పాడు సదాశివ.

"మీ ఆవిడని తీసుకుని ఓసారి రండి అన్నయ్యగారు. ఆవిడ్ని చూసి చాలా రోజులైంది" భావన్నారాయణ భార్య సదాశివతో చెప్పింది.

"అలాగే. మా ఆవిడంటూంటుంది శ్రావణ మాసాలు పూర్వం వారింటికి పేరంటానికి వెళ్ళేదాన్ని, వాళ్ళు దూరం వెళ్ళిపోయారని."

"నిజమే. అద్దెలు భరించలేక ఇంత దూరం వచ్చాం" నొచ్చుకుంటూ చెప్పిందావిడ.

విఘ్నేశ్వరుడి బొమ్మ వారింట్లోని టి.వి మీద త్రివిక్రంకి కనబడింది. అదికూడా అతను రెండిళ్ళలో చూసినలాంటి మెటీరియల్‌తో చేసిందే

"ఆ బొమ్మలు ఏలూరు ప్రత్యేకతా?" దాన్ని చూపిస్తూ అడిగాడు త్రివిక్రం.

"కాదు. దీన్ని స్రుజన చేసి తన గుర్తుగా నాకు ఇచ్చింది. సబ్బుతో ఇలాంటివి చేసి అమ్ముతూంటుంది" భావన్నారాయణ భార్య చెప్పింది.

ఇద్దరూ బయటికి వచ్చాక అడిగాడు త్రివిక్రం "మీతో కలిసి పనిచేసిన మిగిలిన వారి ఇళ్ళ అడ్రస్‌లు డ్రైవర్‌కి చెప్పండి. మిమ్మల్ని ఇంటి దగ్గర దింపేస్తాను. మీకు ఆఫీస్‌కి టైం అవచ్చు."

"ఇంకొక్కరే ఉన్నారు. అది మనం వెళ్ళే దారిలోనే. అక్కడ అయిదు నిముషాలు ఆగుదాం. ఆ తర్వాత నన్ను ఆఫీసులో దింపండి. ఇంటిదాకా వెళ్ళక్కర్లేదు."

ఆ కొలీగ్ ఇంట్లో త్రివిక్రంకి ఓ కొత్త సమాచారం తెలిసింది. విశ్వేశ్వరరావు మొదటి భార్య ప్రమీలది కోనసీమలోని ఎదుర్లంక. ఆమె తండ్రికి అక్కడ కొబ్బరి తోటలు ఉండేవి. ఆయన పేరు తెలీదు. కానీ ఆ ఊళ్ళో ఎవర్నడిగినా ప్రమీల తండ్రి ఇల్లు చూపిస్తారు. ఆయన అందరికీ తెలుసు.

ఎదుర్లంకకి వెళ్తే విశ్వేశ్వరరావు చిరునామా తెలియవచ్చు అనుకున్నాడు. కానీ ఏలూరు నించి అక్కడికి వెళ్ళడానికి టైం సరిపోలేదు.

విశ్వేశ్వరరావు ప్రస్తుతపు హైదరాబాద్ అడ్రస్ తెలుసుకోకుండానే త్రివిక్రం ఏలూరు నించి తిరిగి హైదరాబాద్ వచ్చేసాడు.

## 6

ఇంటికి వచ్చాక త్రివిక్రం సుందరేశ్వర్‌ని అడిగాడు.

"ప్రత్యేకంగా విశేషాలేం లేవు కదా?"

"లేవండి. వాటర్ బిల్ వచ్చింది. మీ టేబుల్ మీద పెట్టాను. నేను రాత్రి పడుకోబోయే ముందు మీ నాన్నగారి పాత డైరీలని చదివి వినిపించాను."

"ఏదైనా గుర్తించినట్లు కనబడ్డారా?"

"మీ చిన్నప్పుడు మీ నాన్నగారు కాల్చిన మొక్కజొన్న కండెలని తినిపించే పద్ధతి గురించి రాసింది చదివాను కండెలోని ఓ లైన్‌లోవి వలిచి పక్క లైన్ వదిలేసి, దాని పక్కలైన్‌లోవి వలిచి, అలా గింజలు దూరదూరంగా ఉన్న కండెని మీకు తినడానికి ఇచ్చేవాడినని, తను ఆ వలిచిన గింజలని తినేవాడినని రాసారు. నేనది చదవగానే గట్టిగా నవ్వారు."

"గుర్తుందిటా?" ఆశగా అడిగాడు త్రివిక్రం.

"నవ్వడం అయ్యాక ఆయన్ని నేను అదే ప్రశ్న వేసాను. ఆయన 'ఏమిటి గుర్తుండటం?' అన్నారు. మళ్ళీ నేను దాన్ని చదివాను. ఈసారీ నవ్వారు. కానీ ఆ సంఘటన తనకి గుర్తుందని చెప్పలేదు."

"అది గుర్తొచ్చి నవ్వారో లేక ఇప్పుడు విని విచిత్రంగా అనిపించి నవ్వారో?" త్రివిక్రం అనుమానం వ్యక్తం చేసాడు.

"నిజమే."

"మా నాన్నగారిలో అల్జిమీర్స్ లక్షణాలన్నీ గమనించాను. రాత్రి నిద్ర తక్కువగా పోయేవారు. సరిపడా నిద్రపోకపోతే జ్ఞాపకాలని మెదడులో నెలకొల్పుకునే శక్తి నశించిపోతుంది. మెదడు చుట్టూ ఉండే నీటి పరిమాణం తగ్గినా మెదడుకి కావాల్సిన పోషక పదార్థాలు అందవు. ఆ విధంగా మెదడు డెబ్బై అయిదు శాతందాకా కుంచించుకు పోవచ్చు. ఏభై దాటాక మా నాన్నగారిలో కనబడ్డ ఇలాంటి లక్షణాలని నేను అల్జిమీర్స్ వ్యాధి లక్షణాలుగా గుర్తించలేకపోయాను. తండ్రిని తండ్రిగా తప్ప రోగిగా చూడటం నాకు తెలీలేదు. మా నాన్నగారి ముందు నా డాక్టర్ బ్రెయిన్‌ని నేను ఎన్నడూ ఉపయోగించలేదు. ముందే పసికట్టి ఉంటే బావుండేది." త్రివిక్రం విచారంగా చెప్పాడు.

***(కొనసాగింపు వచ్చేనెలలో)***

**ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి**

www.anandbooks.com
www.telugubooks.in

Post your comments